ఓయ్ ఓయ్ ఆగు. అందుకే అడిగాను. రాక్షసుడనడానికి కారణం ఏమిటే? బాలనాగమ్మని యెత్తుకుపోయాడా? ఏకచక్రపురం మీదపడి మనుషుల్ని మింగేశాడా? ఏవిటంటావు ? — నువ్వేమీ అనొద్దులే, విను. శేషయ్యగారు చేసిన తప్పు — రాక్షసప్పనీ మరేంకాదు. నరశింహులు అనే ఓ మిత్రుడు కష్టంలో వుంటే తల తాకట్టుపెట్టి పందొందల రూపాయలు అప్పిచ్చి ఆదుకోడం. అంతేనయ్యా గిర్రున తిరిగేసరికి ఆ బ్రాహ్మడికి వెర్రెత్తించారనుకో. ఇచ్చినరోజున పుచ్చుకున్న నరశింహులు ఇతగాడ్ని ఇంతవాడనీ అంతవాడనీ తెగ పొగిడేశాడు. స్నేహం అనే మాట మీద యెక్కడేనా వాదాలువస్తే శేషయ్య అనే అర్థం శంగున సరిపోతుందని దండోరా వేశాడు. తీరా అప్పుతీర్చే వాయిదా వచ్చి వెళ్ళేవరకూ, ఆ ఉత్సాహం అప్పుచేసిన డబ్బులా హడావిడిగా ఖర్చయిపోయింది. పూర్వం

మళ్లె నరశింహులికి, ఋణదాత శేషయ్య మొహంలో కరుణ తొణికిస లాడడం కనబడడం మానేసింది. అతని మాటలో పూర్వం పేట్రేగిపోతూ వచ్చిన అణకువ దరిమిలా అణగారిపోయినట్లు అనుమానం వచ్చింది. శేషయ్యగారి ఆత్మవిశ్వాసం కట్టలేని పొగరు అని ఇన్నాళ్లా పోల్చుకో లేక పోయినందుకు అతనూ అతని కొత్త మిత్రులుకూడా పనులు మానుకు మరీ ఆశ్చర్యపడసాగారు.

శేషయ్యని కొందరు మిత్రులు కదలేశారు — ఆ నరశింహులు నా స్నేహితుడు. అతనే ఇచ్చేస్తాడు. చాలా మంచివాడు అన్నాడుట శేషయ్య.

హారి వెధవా! వీడికి అడ్డమైనవాడూ అప్పులివ్వా! ఎంత హేళన! ఇదంతా వెంగెం, శ్లేష్మం కాబోలు. బోడిపె.... వీడికీ వీడి బతుక్కీ చమత్కారం ఒకటీ అనుకున్నారు నరశింహులూ వాళ్ళూను. శేషయ్యకి వ్యంగ్యంలో ప్రజ్ఞ ఉందని నిర్ణయించిన మర్నాటినుంచీ నరశింహులు కోపం తెచ్చుకున్నాడు.

నేను చచ్చినా వీడికి ఆ బాకీ తీర్చను. చూదాం వాడికెంత ఓపికో, వాడి ఓపిక అంతు కనుక్కునే ఓపిక నాకూ వుంది అన్నాడు నరశింహులు. అతని వాక్చాతుర్యానికి పొంగిపోయి శేషయ్య శత్రువోడు ఉన్నపళంగా పదిరూపాయలు అప్పిచ్చేశాడు. అక్షర లక్షలు అప్పిద్దును పెట్టుబడి పెట్టే వాడుంటే అన్నాడాయన ఉదారంగా. అప్పుడు నరశింహులు కృతజ్ఞతతో ఉక్కిరి బిక్కిరై పోయి, పదిరూపాయల్లోనూ మూడు రూపాయలు అప్పటి కప్పుడే అప్పుతీర్చి పారేశాడు.

శేషయ్య మర్యాదగా నడుచుకొని ఉంటే వాడికి మాత్రం యిలా పారెయ్యకపోయాడా అన్నాడు ఓ నిమిషం తరవాత మిగతా యేడులోనూ వో మూడు అప్పడగబోతున్న అప్పయ్య. తక్షణం శేషయ్య మర్యా

దస్తుడు కాడు అని యీవన్మందీ తీర్మానించుకుని, మర్నాడు సెలవులుపెట్టి అద్దె సైకిళ్ళమీద ఆ వైనం నలుగురికీ బట్వాడా చేయబోయారు.

ఇలా అప్పులిచ్చి చాలా క్రూరంగా వసూలు చేసిన అందరికీ దుష్టుల కథలన్నీ పైకితీసి దులిపి వెల్లవేసి, రంగులువేసి పంచిపెట్టారు. వర్ధమాన నాటక రచయిత ఒకడు 'శేషయ్యలూ పెరుమాళ్ళూ' అనే ఉజ్జ్వల సాంఘికనాటకం రాసేసి, అందులో అప్పులిచ్చే వాళ్ళని యేకేసి అవతల పారేశాడు. ఋణబాధితులంతా శక్తివంచన లేకుండా గబగబా అప్పులు దండెత్తుకొచ్చి నాటక ప్రదర్శనకు యేర్పాట్లు చేసుకున్నారు. అంతలో శేషయ్యకు నిజంగా డబ్బు అవసరం వచ్చింది. వియ్యంకుడు శేషయ్య కూతుర్ని యింటికిపంపేసి, తిరుగు టపాలో కట్నం బకాయి జమ కాని పక్షంలో తమ కుమార్డు చి॥ వెంకట్రామయ్య పునర్వివాహ శుభలేఖ మరుగుటపాలో అందగలదనిన్నీ, గాన తెలియపర్చడమైనదనిన్నీ జాబు వ్రాశాడు. అటు నరశింహులు తల కాయడం కోసం, శేషయ్య తన తల తాకట్టు పెట్టగా డబ్బిచ్చినవారు కూడా డబ్బుగానీ సదరు శేషయ్య తల గానీ రాబోయే ఫలానా తదియనాటికి జమ చేయకబోతే కోర్టల్ల వెంట తిప్పి పరువు ఖర్చు పెట్టించ వలసి వస్తుందని అభిప్రాయ పడడం మొదలు పెట్టారు.

నాయనా, ఏం చెప్పమంటావు. శేషయ్య ఒకరాత్రిపూట గుట్టుగా వెళ్ళి నరశింహులుకి సంగతంతా చెప్పుకున్నాడు. నా పరువు నిలిపి నీ పరువు నిలబెట్టుకో అన్నాడు.

డబ్బేదిబావా, ఉంటే యిన్నాళ్ళా. నాకసలు అప్పులంటే అసహ్యం. ఒకడికి యిచ్చేవాణ్ణేదప్ప దేహీ అన్నవాణ్నిగాను. ఇన్నాళ్ళకి ఖర్మగాలి నీ దగ్గర అఘోరించాను బుద్ధి గడ్డి తిని. చాలు నువ్వు చేసిన మేలు. పంట

కొంపకిరానీ ఇచ్చేస్తా. ఆ శెట్టికో వందో రెండొందలో యివ్వాలి. వాడిది కూడా మొహాన కొట్టేస్తాను. పీడా విరగడవుతుంది అన్నాడు నరశింహులు వినయంగా.

బావా, నేను అప్పివ్వబట్టికదా యింత రభస. ఇటు పిల్ల కాపురం నాశనం అయేలాగుండె. లేపోతే రెండేళ్ళు అగినవాణ్ని ఆర్నెల్లు ఆగనా. నువ్వైనా బాగుపడ్డావుకదా. డబ్బు వడ్డీకి తిప్పుతున్నావుట, పోనీ అలా పడ్డినాసరే అన్నాడు శేషయ్య దురాశకొద్దీ.

నరశింహులికి అప్పు తీసుకున్న వాడికొచ్చేటంత కోపమూ వచ్చే సింది, అతని కేకలువిని దొంగలు పడ్డారనుకుని జనం పోగయ్యారు.

నరశింహులు బొరుమని ఏడిచేశాడు.

అయ్యా చూడండి ఇదీవరస. నా దగ్గిర దేనితాలూకో రొక్కం ఉందనీ, ఇస్తావా ఛస్తావా అనీ రోజూ యిలా అర్ధరాత్రి వేళవచ్చి ప్రాణం కొరుక్కు తినేస్తున్నాడు. లోకంమీద అప్పులిచ్చినవాళ్ళూ వున్నారు. పుచ్చుకున్నవాళ్లూ ఉన్నారు.

—మరీ యింత చేటా, యెంతచేటైనాగాని అంది నరశింహులు ధర్మపత్ని.

నలుగురూ శేషయ్యనే ఆడిపోసుకున్నారు. అతను తలొంచుకు వెళ్ళిపోయాడు. మర్నాడు పట్నం వెళ్ళి కోర్టులో ఓముక్క తగిలించి, వియ్యంకుడింటికెళ్ళి మరొక్కవాయిదా అడిగి తిరిగి చక్కా వచ్చేవరకూ ఊరు గగ్గోలుగా ఉంది.

నరశింహులింట దొంగలుపడి ఊడ్చుకుపోయారట.

ఏమనుకుని ఏంలాభం. వాళ్ళకి రుణపడి ఉంటావు, వచ్చి అప్పు తీర్చుకు చక్కాపోయాడు అన్నారు కొందరు.

శేషయ్యే చేయించాడన్నారు కొందరు. గిట్టనివాళ్ళ మాటలు లెస్తూ అన్నారు కొద్దిమంది. కనీసం యిలా నరశింహులింట నాలుగువేలు నగదున్న వైనం చెబుతూ, యే దొంగలముఠాకో శేషయ్య ఓ కార్డుముక్క రాసిపారేసి ఉంటాడన్నారు నరశింహులు ఆత్మీయులు. చివరికి అంతా మళ్ళీ శేషయ్యనే ఆడిపోసుకున్నారు. వాడి వెధవచేత్తో భోరున యేడుస్తూ డబ్బిచ్చాడు. బెడిసికొట్టి కొంపక్కొంపా నాశనం అనుకున్నారు అమ్మా, లక్కాను.

నాటికీ నేటికీ అతనిమీద ఆ అపరిష్టమ్ముచ్చట అలాగే ఉండిపోయింది. అంచేత బాబూ అప్పులిచ్చేటప్పుడు జాగర్తగా ఆలోచించి మరీ యివ్వాలి. నువ్వు యే చెడ్డపని చేసినా చెడ్డపేరు పెట్టడానికి గడువు దొరుకుతుంది గాని, అప్పిస్తేమటుకు అరక్షణంలో చెడ్డవాడివి అయిపోతావు. దరిమిలా డబ్బు చెడ్డవాడివి, చివరికి స్నేహం, బంధుత్వం చెడ్డవాడివికూడా అయిపోతావు. ఆ పైన నీ యిష్టం. తాళం చేతులు యివిగో. కావాలంటే పైకం పట్టిగెళ్ళు. ఇదంతా నీదే, నాదేముంది అన్నాడు మునసబుగారు.

కులదీపకుడు వంచిన తల యెత్తలేదు. ఎగిరి గంతేసి తాళం అందుకోలేదు. ఓ నిముషం అలాగే కూర్చుని లేచి సరే నాన్నా ఆలోచిద్దాం... రేపు మాదాం అని చెబుతా నా స్నేహితుడితో అన్నాడు.

కాన, ఓ చీమలసింహాద్రీ! విన్నావా, అదీ కథ అని సుబ్బన్న ఆ కథ ఆపాడు.

చివరికి యేమైంది ? ఆ పిల్లడు మర్నాడు వెళ్ళి స్నేహితుడికి అప్పిచ్చాడా? అందో చీమ ఉండబట్టలేక.

చెబుదునుగాని పేజీలు పెరుగుతాయి. పబ్లిషరేమంటాడో అన్నాడు సుబ్బన్న.

అప్పు చేస్తాడు లెద్దూ అంది నాగలక్ష్మి.

అదిగో ఆ మాటేగదా వద్దన్నది అన్నాడు సుబ్బన్న యికిలిస్తూ.

ఇకిలింపు బావుందనుకుంటున్నావుగాని కోరలు లేవని గుర్తుతెచ్చుకో. బోసినోరూ నువ్వూను అంది నాగలక్ష్మి కోపంగా.

సుబ్బన్న కథను కొనసాగించాడు.

మర్నాడు సంజెవేళ మునసబుగారి వంశోద్ధారకుడు గుర్నాథం మళ్ళా తండ్రి దగ్గరకు వెళ్ళి నాన్నా యిచ్చేద్దామే డబ్బా అన్నాడు. మునసబుగారు ఆ మసక చీకట్లోనే సాధ్యమైనంత తెల్లబోయి, ఆ పైనం కొడుకు పసిగట్టి వుండడని అనుమానించి వాడిల్లు బంగారంగానూ — అవసరం తీరాకా అప్పుదొరకా — వాడింకా అప్పుకావాలంటున్నాడురా నీ జతగాడూ అని ప్రకాశంగా ఆశ్చర్యపడ్డాడు.

మర్నిన్నివ్వలేదుగదే అన్నాడు అబ్బాయి.

నిన్ననిస్తే యివాళే మళ్ళీ సర్దేస్తానన్నా డనవుట్రా. ఆ ముక్కే రైటైతే యివాళ యింకా నిన్నడగాల్సిన పనేమిటీ అన్నాడు మునసబుగారు. పిల్లడు నివ్వెరబోయాడు. తన యుక్తికీ సూక్ష్మబుద్ధికీ ముసలాయనకు నవ్వు పెల్లుబికి రాబోయి దగ్గుగా తర్జుమా అయిపోయింది.

ఔనే నాన్నా నిజమేమరి అతను యివాళే యిస్తానన్నాడుగదా నిన్నడిగినపుడూ. గమ్మత్తుగానే ఉందే అని తికమక పడ్డాడు గుర్నాథం.